ప్రణయానికి బ్లాంకు చెక్కు సొసైటీ యివ్వాలి. ఇస్తుందా - ఏవిటి మీ వెర్రి. ఇవ్వదు. ఇవ్వకపోతే కాగితంమీద ఆ సరదా తీర్చుకోవాలిసొస్తుంది. ఇలా కాగితాలమడతల్లో దాగిన కోర్కెలు సంఘంలో మార్పుకోసం గోతికాడ నక్కల్లా కాసుకు కూర్చుంటాయి. ఇంతకీ చెప్పొచ్చేదేవంటే, రక్తపాతం లేకుండా పొలిటికల్ ఫ్రీడం సంపాయించాం కాని. కల్చరల్ రివల్యూషన్ రాకుండా మన సొసైటీ మారదు. మన సొసైటీ మారకపోతే మనజాతికి మోక్షంలేదు. మైడియర్ సిస్టర్స్ అండ్ బ్రదర్స్; స్త్రీనిలాగితే డొంకంతా కదుల్తుంది. (తీగ అంటే లత; లత అంటే స్త్రీ. డొంక అనగా లోకము) స్త్రీల సమస్యగురించి ఆలోచించి చెయ్యాల్సింది స్త్రీలుకారు. ఏ గురజాడో వీరేశలింగమో రాజారామమోహనరాయో ప్రొఫెసర్ కార్వే వంటివారు. స్త్రీలు ముఖ్యంగా చేయవలసిన సహాయం ఒకటుంది. అది దారికడ్డంగా లేకుండా వుండటం....

# రాగమాలిక

మొన్న సైకిలుమీద లైటు లేకుండా వెళ్తే మావార్ని పోలీసు పట్టుకున్నాడ్ట. మా యింటిముందు లాంతరుస్తంభం వెలగడంలేదు. శాన్నాళ్లయి...దాన్ని వెళ్ళిపట్టుగోడేమి? చీకట్లో దీపంలేకుండా వెళ్లకూడదు. సరే... చీకట్లో దీపం లేకుండా జీవించవచ్చా? ముందు యింట్లో దీపం తిన్నగా వెలిగితే, సైకిలుమీద కూడా తిన్నగా వెలుగుతుందని చెప్పరేమి? గుళ్ళో దీపం పెడితే పుణ్యమూ. గుడిసెలో దీపం పెడితే పాపవునా? దీపాలవారి చిన్నదాన్ని కోపాలవారి చిన్నవాడికిచ్చి పెళ్ళి చేస్తారట. శుభలేఖ.. దీపాలవారంటే ఎలక్ట్రిసిటీవారూ, కోపాల వారంటే పోలీసువారూనూ. కోపాలవారు తమ కోర్కెలతో దీపాలవారిని ఆర్పేస్తారేమోనని నాకో చిన్న డవుటు.

దీపం లేదని పట్టుకున్న పోలీసు. పావలా పరకా పుచ్చుగుని తృప్తి పడకుండా. మావారిచేత గుంజీలుకూడా తీయించాడేమో ఖర్మ; ఈ మగాళ్లు అడ్డమైన అవమానాల్నీ హాండ్ కర్చీఫ్‌తో తుడిచేసుకుంటారు. మరి మన ఆడాళ్ళు చెంగుతో తుడిచేసుకున్నట్లు... అవదం దీపమైనా తిన్నగా వెలగాలంటే చమురుండాలి. వత్తిని ఎగసన తోయడాని కోపూచికపుల్ల లాటి దుండాలి. హరికేన్ లాంతరుకి చిమ్నీ బాగుండాలి. బర్నరు మంచిదై యుండాలి. విద్యుద్దీపానికి బల్బుండాలి. కరెంటుతోపాటు కనెక్షన్లన్నీ టీక్‌టాగ్గా వుండాలి. అప్పుడే మీట నొక్కితే దీపం వెలుగుతుంది. పెళ్ళామైనా అంతే, మొగుడైనా అంతే - అన్నీ సరిగ్గా వుంటేనే మొహంలో వెలుగు - లేకపోతే బ్రతుకంతా అయోమయవేఁ... బ్రతుకంతా చీకటే అయిపోతుందేమోనని, వెలుతురుకూడా మనుష్యులు సమంగా పంచుకోరే మోనని చందమామను తెచ్చి యిస్తే రష్యావారూ, అమెరికావారూ అర్ధానికోసం కొట్టుకు చస్తున్నారు.

మందడి దడిగోడ విషయమై అగ్ని హోత్రావధాన్లు కున్నంత పట్టింపు చంద్రుని విషయమై రష్యా అమెరికాల కున్నట్టుంది. రష్యా అంటే ఏవిటి - రుషి శబ్దంలోంచి రష్యా వచ్చింది. రష్యా అంటే రుషుల దేశవన్నమాట. కాస్పియన్‌సీ అంటే ఏవిటి? మీకు తెలీదా - నోట్ బుక్ తీసుకురాసుకోండి. కశ్యపప్రజాపతి పేరు విన్నారా దట్సాల్; కాస్పియన్ సీ అంటే, కోకోనాడా, రాజహ్ ముండ్రిలాగా స్పెల్లింగు వుచ్చారణ భేదవేగాని అది కశ్యపుడనే రుషి పేరిటవున్న సముద్రం. "ఇంకారండి... చెప్తా. వోడ్కా అంటే ఏవిటి... సైలెన్సు; గొడవ చేయకండి. ...ఉదకః అంటే ఏవిటి ...సైలెన్సు; గొడవ చేయకండి... ఉదకః అంటే ఏవిటి ఉదకము - వోడ్కా పదిమాట్లు అనండి. మళ్ళీ ఉదకం అనండి. నౌ, వోడ్కా అంటే ఉదకశబ్దం నుండి వచ్చిందని వీథిలోకెళ్ళి టముకేసి చెప్పండి. మరి అమెరికా మాటేవిటి... ఋషుల దేశం గనుక రష్యా అంటే, అమరారి నిర్జరాదేవా; అమరులుండే దేశం గనుక అమెరికా అన్నారు. అన్లేదా అనకపోతే యిప్పుడు నేనంటున్నాను. టేకిట్ ఈజీ....

సోయజ్ అని ఈ మధ్య రష్యావారు ఒక రాకెట్‌ని భూమిచుట్టు తిరగమని ఆకాశంలోకి ఎగరేశారు. అఫ్‌కోర్సు అది భూమిచుట్టు తిరుగుతోందనుకోండి. మరి సోయాజ్? అంటే ఏవిటి. తెలియదూ మీది మట్టి బుర్ర. శాన్‌స్క్రిట్ వచ్చన్నారు. రాదా - పోన్లెండి టేక్ శబ్దరత్నాకరం. ఆర్ శబ్దార్థ చంద్రిక అండ్ సీ "సాయుజ్యం" - ఏవిటి రాశాదందులో ...సహయోగము.. మరో దానితో లీనం కావడం. ...సోయజ్-3 చేసే పనేవిటి... సాయుజ్యము అంటే భూమినుండి వెళ్ళి మరో దానితో కలియడం.... ఇప్పుడు నా డిస్కవరీ రైటంటారా? నేనూరికే పప్పు రుబ్బుతున్నానని వంటయింటి కుందేల్నని మీరు అనుకుంటున్నారు కాబోలు... నా రిసర్చి వర్కంటే గోంగూర పులుసనుకుంటున్నారా? బెస్టు థాట్స్ - బెస్టు అప్రోచ్ నాది.

నోవెల్సు, స్టోరీస్, పొయిట్రీ కాదండి, మనవంతా బాగా రిసెర్చి చేసి కొత్త కొత్త తమాషా తమాషా సంగతులు కనుక్కుని జనానికిచెప్పి వీళ్ళను బోల్తాకొట్టించాలి. బోల్తా అని ఎందుకన్నానంటే మనకి కల్చరెక్కడ ఏడిసిందండి? నీ వీపునేను గోకితే నా వీపు నువ్వుగోకు అనే టైపు మేథావులే మనవాళ్ళంతా - నిజమైన మేథావులూ జీనియస్సులూ వుంటే వాళ్లు అణాకాని పోలిటీషియన్సు కాళ్ళు కడిగి నెత్తిన నీళ్లు చల్లుకోవడానికి యిష్టపడరు. వాళ్ళని దేశం నుంచి తరిమేసి తరువాత "మావాడే" నని గోత్రాలు కలుపుకోడానికి మనకి షేమ్ లేదు. రాజకీయ స్వాతంత్ర్యం తెచ్చిన మాత్రాన టీచర్ కంటె, సైంటిస్టు కంటె కవి రచయితకంటె రాజకీయ నాయకుడెలాగెలాగ గొప్పవాడయాడు వాడి రికమండేషను లేందే అంబ పలకదేమి?

మనది వెనకటికి హరికథలూ మంగళహారతుల కల్చర్, బాబాలూ వీభూతిపళ్ళ కల్చర్... ముందు జన్మల కోసం మనం గుళ్ళచుట్టూ వీభూది పళ్ళ చుట్టూ తిరిగి తిరిగి "తిరిగి తిరిగి పక్షులెల్ల చెట్టువెదకు రీతి భువిని పుట్టగానె నీ పదముల..." అవును. వర్తమానాన్ని అసహ్యించుకోవడం కాళ్ళు పట్టుకోవడం మనకి రెలిజియనే నేర్పింది. ఇదివరకు పూజారుల కాళ్ళు పట్టుకున్నాం. ఇప్పుడు రాజకీయ నాయకుల కాళ్ళు పట్టుకుంటున్నాం. మన దేశానికి

ఆర్థిక స్వాతంత్ర్యం ముందొస్తుందో, సాంస్కృతిక విప్లవం ముందొస్తుందో తెలీదుగాని... రెండూ ఎంత త్వరగా వస్తే అంత మంచిది. ఇదంతా గాస్ అనుకునేరు. గాస్ అనుకుంటే గిరీశం చెప్పినట్లు "బిగ్‌యాస్" అయిపోతారు. ఇవేవీ జరక్కుండా స్త్రీలలోగాని, పురుషులలోగాని ఒకరిమీద ఒకరు తిరగబడి నంత మాత్రాన. వర్గస్వభావాన్ని అర్థం చేసుకోకుండా కూర్చుని వాపోతారని నేను వ్రాక్రుస్తాను.

ఒక పిల్లో, పిల్లడో కట్నం లేకుండా పెళ్ళి చేసుగుంటేనూ - ఒక కులాంతర మతాంతర వివాహం జరిగితేనూ, చంకలు గుద్దుకోవడం మానెయ్యాలి. అల్లా రిఫారం పెళ్ళిళ్ళు చేసుగున్న జంటలకు సోషల్ సెక్యూరిటీ వుందా - వుంది. డబ్బుంటే అధికారం వుంటేవుంటుంది. లేకపోతే వుండదు. పవరూపైసావుంటే ఏం చేసినా కృష్ణలీలలు క్రింద వస్తుంది. లేకపోతే నరకాసురవధే.

ఓల్డురివైవలిస్టులూ, సనాతనిజంగాళ్లూ భారతీయసంస్కృతి అంటూ కాషాయముసుగులు కప్పుకున్న పులులూ, ప్రజల్ని మేకల్ని నవిలేసినట్లు నవిలేయకుండా మరో యాభైఏళ్ళకన్నా మనదేశం గాఢనిద్రనుంచి మేల్కొని 'నిజం' వైపు పురోగమిస్తుందని ఆశించవచ్చు.

అఫ్‌కోర్సు - మన కంట్రీలో చాలామంది కొంపల్లో జ్ఞానదీపాలు వెలగడంలేదు. కాని మనపోలీసులు సైకిల్ ముందు మాత్రం దీపంవెలక్కపోతే చెడ్డగాబరా పడిపోతారు. యావత్తైలంతావద్ వ్యాఖ్యానం అని చవురులేకుండా దీపాలు వెలగవనీ, కొందరి దీపాలు ఆరితేనేగాని మరి కొందరి దీపాలు వెలగడాని కవకాశం ప్రస్తుతసమాజంలో లేదని పాపం పోలీసులకు తెల్దు. ఆళ్ళే గవర్మెంటాఫిండియా - గవర్మెంటాఫిండియాకి తెల్దు. ఇంటింటా దీపాలు సరిగ్గా వెలగాలంటే దానికి బోల్డు తతంగం వుంది. ఇప్పుడు చెప్పడానికి నాకిష్టంలేదుగాని దీపం ఆర్పేసి పడుకోండి. ఆరిపేయవె దీపమూ అన్నాడు నాయుడుబావ.... నాయుడుబావే పోలీసయాక దీపంలేదని మావార్ని రోడ్డుమీద పట్టుకుని నిలేసి గుంజీలుగట్రా తీయించాడు. అజ్ఞానులు జ్ఞానులచేత గుంజీలు తీయిస్తున్నారు. పరమ శుంఠలు బేక్‌డ్ బైమనీ అండ్ పవర్ మేధావుల్ని దేశంనుంచి తరిమేస్తున్నారు. మరో యాభైఏళ్ళలో చదువుకున్నవాళ్ళు ఎక్కువవుతారు. జ్ఞానదీపాలు వెలిగితే - అజ్ఞానులూ పరమశుంఠలూ గద్దెమీదెక్కి "ఎద్దుల్ని గెద్దల్నీ - జండాల్నీ" చూపించి జనాన్ని మోసంచేయటానికి వలనుపడదు. అప్పుడు దేవదానవులు ఎలాగూ అమృతం కోసం క్షీరసాగరమథనం చేస్తారు.

వాటీజ్ దిస్... దోమలు కుడుతున్నాయ్. ఆ దీపంచుట్టూ ఆ పురుగులేమిటి...వ్హాట్ ఆర్యూ డూయింగ్... రీడింగ్.. డోంట్ రీడ్ మైమాన్... రైటింగ్ మేక్స్ ఎమాన్ పర్‌ఫెక్టు... అఫ్‌కోర్స్ రైటింగ్ వల్ల లేడీస్‌కూడా పర్‌ఫెక్టు అవుతారు. అయ్యో....నా మతిమండా... నీళ్ళకాగు దొడ్లో వదిలేశాను....వస్తారా మనిద్దరం సాయంపడదాం... డోంట్ కమాఁ... ఆల్‌రైట్ ఫిఫ్టీరుపీస్ జాగ్రత్తచెయ్యండి. మరోకాగు కొనుక్కుందాం... అయితే హోంవర్కు ఏం చేయరన్నమాట - వీధిలో కెళ్తే లైటులేదని పోలీసువాడు పట్టుకుంటాడు. ఇంటికొస్తే హోంవర్క్ చేయలేదని పెళ్ళాం

పట్టుకుంటుంది... ఎలాగంటారా? ఐ టెల్యూ దొడ్లోకి రండి... అక్కడ వెన్నెల బాగానే వుంటుంది. రాగికాగు వదిలేస్తే అది తాతల నాటిది... మన ప్రాచీన సంస్కృతి అంతా దొడ్లో మర్చిపోయినట్లు ఫీలింగు వస్తుంది. ఆ కాగు మూల పిల్లి పిల్లల్నిపెట్టింది. ఇప్పుడక్కడికి వెళ్తే అది మీదపడి గుడ్లు పీకుతుందేమోనని నాకు భయం... లేకపోతే నేను మిమ్మల్ని బతిమాలేదాన్నా - అవునండీ మొన్న జీడిపప్పు అరకేజి తెప్పించి హార్లిక్స్ సీసాలో పోసి పైన విషం అని రాసేను గదా అంతా మీరే తిన్నారూ... నాక్కొంచెం అన్నా మిగల్చకుండా - అయితే స్వీట్సు అని రాసిన డబ్బాలో చింతపండుంది. అది కూడా తినండి. నా షేర్ కూడా తినేసినందుకు ఈ కాగు యింట్లో పెట్టేశాక వెళ్ళి కారప్పూస కొనుక్కురండి సైకిలు మీద - లైటు లేదా... ఐడోంట్ కేర్... మళ్ళీ ఆ పోలీసుకు దండంపెట్టి వెళ్లి నాకు కారప్పూస తెస్తారా లేదా? వాకింగ్ ఈజ్ బెస్ట్..? కారప్పూస అంటే వృత్తి కారప్పూస పట్టుకొచ్చేరు తెలుగు మాష్టార్లా. కారప్పూస ఫాలోడ్ బై చేగోడీస్ అండ్ పకోడీస్... కాగు తీసుకొచ్చి యింట్లో పెడితేనే చివ్రల్రీ... మీరు తెస్తారా లేకపోతే మీ మీద కంప్లెయింట్ బుక్‌లో రాయమంటారా?

# పతిభక్తి రంజని

నాలుగడుగులేసి యింకెంత దూరవండి - అన్నానుట ఏడుపు మొహం పెట్టి... యింటి కొచ్చాక గొప్పగా చెప్తూతూ నవ్వడం ఆరంభించారు. అప్పుడు “నోర్మూయ్ రాస్కెల్” అని మా మావయ్య గారు తిట్టాక నిఝంగా నోర్మూసుకుని కుక్కిన పేనులా గదిలోకి పోయి దాక్కున్నారు నా స్టూడెంటు మొగుడుగారు. “ఓపలేని పిల్లను అలా రోడ్లంట తిప్పకూడదురా! వొద్దువొద్దని మా అత్తయ్య వార్నింగు యిచ్చినా వినకుండా కుర్రతనపు సరదాకొద్దీ, మా వారు నన్నోమారు వైజాగ్‌లో బీచొడ్డు, సిన్మాకు - జేబులో “టూ అండ్ ఫ్రో” సరిపడే డబ్బులున్నాయోలేవో చూసుగోకుండా నడిపించుకు తీసుకెళ్ళారు. లవ్విజ్ బ్లైండు కదా - అందుకని నేను కూడా తోకలా పతిభక్తిరంజనిలా నడుచుకుంటూ వెళ్ళాను.

ఆ నైటుకే నా కాళ్ళు పొత్రాల్లావాచి పోట్లూ సలుపులూనూ, నేను ఏడుస్తూ కూర్చుంటే “బొండాం - బొండాం” అని వెక్కిరించడం మొదలెట్టారు. యూకలిప్టసాయిల్ తెప్పించి కాళ్ళకు రాసుకుని కాపడం పెట్టుకుపడుకున్నాను. నీ పతిభక్తి ఏడిసినట్లే ఉందని వాడితో తిరగొద్దని చెప్పానా? అని మా అత్తయ్య కేకలేసింది. అఫ్‌కోర్సు తిరగనని మాటిచ్చాను. భక్తి- పతిభక్తి ప్రదర్శించడానికిగాని, నిజంగా తు.చ. తప్పకుండా ఫాలో అయితే పిట్‌ఫాల్స్ తప్పవని నాకేనాడో తెలిసింది. మొగుడు వెనక్కాల అరణ్యాల్లోకి వెళ్ళడవంటే పిక్నిక్కుకు వెళ్ళడవనుకుంది రామాయణంలో సీత.